

19న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కాకినాడ

వికాస ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో గల వికాస కార్యాలయంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కెఎల్.రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తునిలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో ఉన్న ఖాళీ పోస్టులైన ట్రైనీ (ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్, మెకానికల్ మెయిన్టనెన్స్) ఉద్యోగాలకు బిఎస్‌సి(కెమిస్ట్రీ), డిప్లొమో (మెకానికల్), బి.టెక్ (మెకానికల్) 2019 నుంచి 2024 సంవత్సరాలలో ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులన్నారు. జూనియర్, సీనియర్ ఇంజనీర్, జూనియర్ కెమిస్ట్, కెమిస్ట్ అండ్ సీనియర్ కెమిస్ట్ ఉద్యోగాలకు బిఎస్‌సి (కెమిస్ట్రీ), బి.టెక్ (మెకానికల్), డిప్లొమో (మెకానికల్) ఉత్తీర్ణులై ఎక్స్పీరియన్స్ ఉన్న పురుష అభ్యర్థులు అర్హులన్నారు.

అంగన్‌వాడీలకు ఎగనామం

- సంక్షేమ పథకాల్లో కోత పెడుతున్న సర్కార్
- తాజాగా 'తల్లికి వందనం'లోనూ అదే తీరు
- అరకొర వేతనదారులు ప్రభుత్వఉద్యోగులట
- ఇదేమి చోద్యం అంటున్న కార్యకర్తలు



అంగన్‌వాడీలకు పథకాలు అమలు చేయాలంటూ ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేవలం అరకొర వేతనాలను మాత్రమే ఇస్తూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా ఎలా పరిగణిస్తారు.? సంక్షేమ పథకాల్లో ఎందుకు కోత విధిస్తున్నారు.? రేషన్ కార్డుల్లో ఎందుకు చేర్చడం లేదు.? ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, గ్యాస్ సబ్సిడీ ఇలా అన్నింటిలోనూ తమకు అన్యాయమే జరుగుతుంది' అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తాజాగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంలోనూ అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారంటూ మండిపడుతున్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తిగా విస్మరించగా అదే బాటలో కూటమి ప్రభుత్వం సైతం నడుస్తుండడంతో అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చి గద్దెనెక్కాక తమ పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని దుయ్యబడుతున్నారు.

జిల్లాలో ఐసిడిఎస్ 10 ప్రాజెక్టుల పరిధిలో 1986 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు, 11,518 మంది బాలింతలు, 13,134 మంది గర్భవతులు ఉన్నారు. సుమారు 3,500 మంది కార్యకర్తలు, ఆయాలు పని చేస్తున్నారు.

సేవలు ఎక్కువ...వేతనాలు తక్కువ

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకపాత్ర వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. రక్తహీనత, సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే జాబ్ చార్ట్‌లో లేని పనులను సైతం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వీరికి అరకొర వేతనాలను మాత్రమే అందజేస్తుంది. అంగన్‌వాడీ ఆయాలకు రూ.7 వేలు, కార్యకర్తకు రూ.11,500 మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారు. మినీ వర్కర్ జీతం కూడా రూ.7 వేలే. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. చాలీచాలని వేతనాలతో అంగన్‌వాడీలు తమ కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి జీవనం సాగిస్తున్న పరిస్థితి నెలకుంది. కుటుంబంలో అందరూ కష్టపడితేనే కానీ పూట గడవని పరిస్థితి ఉన్న నేపథ్యంలో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు ఈ వేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదు.

ప్రభుత్వ ఉద్యోగులు ఎలా అవుతారు.?

అంగన్‌వాడీ వ్యవస్థలో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ సర్కారు సంక్షేమ పథకాలలో కోత పెడుతుంది. వీరిని సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే పనిగంటల పెంచి విపరీతమైన పని ఒత్తిడిని పెంచారని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలుచేస్తామని మ్యానిఫెస్టోలో చెప్పి ఇప్పుడు అధికారంలోకి రాగానే తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా ఎలా నిర్ధారిస్తారని కూటమి ప్రభుత్వాన్ని వారు ప్రశ్నిస్తున్నారు.

సంక్షేమ పథకాలకు దూరం

అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా భావిస్తూ సర్కార్ ఇప్పటికే పలు సంక్షేమ పథకాలను దూరం చేసింది. రేషన్ కార్డులు సైతం ఇవ్వని పరిస్థితి. ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, గ్యాస్ సబ్సిడీ ఇలా పలు పథకాలను నిలిపి వేస్తున్నారు. తాజాగా 'తల్లికి వందనం'లో కూడా చోటు ఇవ్వలేదు. ఇంట్లో పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని, ఎటువంటి నిబంధనలూ విధించమని ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం మాట మార్చింది. అనేక నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకునే ప్రయత్నం చేస్తుంది. విద్యుత్తు బిల్లు 300 యూనిట్లు దాటకపోయినా గత బిల్లులను ప్రస్తుతం వస్తున్న బిల్లులకు కలుపుతూ వేల మందికి ఈ పథకాన్ని దూరం చేసింది. ఆఖరికి ప్రభుత్వ ఉద్యోగులుగా భావిస్తూ అంగన్‌వాడీలకు సైతం కోత పెట్టింది.

ప్రభుత్వ తీరు సిగ్గుచేటు



అరకొర వేతనాలను మాత్రమే ఇస్తూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను నిలిపివేస్తుండడం సిగ్గుచేటు. ఇటువంటి చర్యలు సరికాదు. అంగన్‌వాడీల కుటుంబంలో పిల్లలకు తల్లికి వందనం వేయకపోవడమే కాకుండా ఇంట్లోని వృద్ధులకు వృద్ధాప్య పింఛన్‌ను సైతం నిలిపివేశారు. భర్త చనిపోయిన వారికి వితంతు పెన్షన్, వికలాంగ పెన్షన్ ఇవ్వడం లేదు.

-జి.బేబీరాణి, రాష్ట్ర అధ్యక్షులు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

వేతనాలు సరిపోవడం లేదు



ప్రస్తుతం ఇస్తున్న వేతనం అంగన్‌వాడీ సెంటర్లోని పిల్లలకు వండి పెట్టేందుకు, సెంటర్ అద్దెలకు పెట్టుబడి పెడుతూ తామంతా పస్తులు ఉండాల్సి వస్తుంది. కావున ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలి. లేదా కనీస వేతనాలను అమలు చేస్తూ సంక్షేమ పథకాలు అన్నింటినీ ఇవ్వాలి.

-ఇ.చంద్రావతి, కార్యదర్శి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, కాకినాడ జిల్లా.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్తు సదుపాయాలు సక్రమంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పాఠశాల విద్య, జిల్లా పరిషత్, డ్వామా, పంచాయతీ, పాడా శాఖల అధికారులతో పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, న్యూట్రిన్ గార్డెన్ల పెంపకం, ఫెన్సింగ్ ఏర్పాటు, క్రీడామైదానాలు నిర్వాహణ, యోగాంధ్రా తదితర అంశాలపై అన్ని మండలాల ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పాఠశాలలు పున్ణ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్ని తరగతి గదుల్లో విద్యుత్తు సదుపాయం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరుకు ఉపయోగించే ట్యాంకులను శుభ్రం చేయించి, సురక్షితమైన తాగు నీరు అందించాలని ఆయన తెలిపారు. మరుగు దొడ్లలో సక్రమంగా నీరు అందుబాటులో ఉండాలని, పాఠశాల ఆవరణంలో న్యూట్రిన్ గార్డెన్ పెంపకానికి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. న్యూట్రీన్ గార్డెన్‌కు రక్షణ కల్పించేలా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలన్నారు. అన్నిచోట్ల కాంపౌండ్ వాల్ ఉండేలా చూడాలన్నారు. అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు, మరమ్మతుల నిమిత్తం పాఠశాల గదులలో వేసిన మెటీరియల్స్ ను వెంటనే తొలగించి శుభ్రం చేయించాలని, పాఠశాల క్రీడా మైదానాలను విద్యార్థులు వినియోగించు కునేందుకు అనువుగా శుభ్రం చేయించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, పాడా పీడీ చైత్రవర్షిణి, డిపిఒ వి.రవికుమార్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

పుస్తకాలు, యూనిఫాంలను అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు జిపిఎల్.అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఇఒ స్వామిని అరుణ్ కుమార్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రయివేట్ విద్యాసంస్థల, కాలేజీల్లో పుస్తకాలను విక్రయిస్తూ విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని విద్యాసంస్థలను మూసివేయాలని డిమాండ్ చేశారు.



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న అరుణ్‌కుమార్



డయేరియా బాధితులకు కొనసాగుతున్న చికిత్స

-బృందాలతో ఇంటింటా సర్వే
-బాధిత గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - రౌతులపూడి

డయేరియా భారిన పడి ఆసుపత్రిలో ఉన్న బాధితులకు చికిత్సను కొనసాగిస్తున్నారు. మంగళవారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ విల్సన్ ఆధ్వర్యంలో కాకినాడ జిజిహెచ్ నుంచి ప్రత్యేక వైద్య బృందాలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వైద్య సేవలు అందించారు. అలాగే సార్‌లంక డబ్బాది, సత్యవరం, సుందరకోట గ్రామాల్లో వైద్య బృందాలు పర్యటించి ఇంటంటా సర్వే నిర్వహించి వైద్య శిబిరాల్లో వైద్య సేవలు అందించారు. ఇదిలావుంటే ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. టిడిపి నాయకుడు సోమరౌతు చంద్రమౌళి ఏర్పాటు చేసిన పండ్లు, పౌష్టికాహార కిట్లను ఎంఎల్‌ఎ రోగులకు అందజేశారు. అలాగే వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు ఆసుపత్రిలో రోగులను పరామర్శించారు.

పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శన

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండను నిరసిస్తూ, పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు జరిగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండ ఆపాలని వామపక్షాల ఆధ్వర్యంలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ ప్రదర్శన జరిగింది. మంగళవారం స్థానిక మసీదు సెంటర్ నుంచి గ్లాస్ హౌస్ సెంటర్, దేవాలయం వీధి మీదుగా బాలాచెరువు సెంటర్ వరకు కొవ్వొత్తులు వెలిగించి ప్రపంచ శాంతి వర్ధిల్లాలని ప్రదర్శన సాగించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జీ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు జె.వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు ఏగుపాటి అర్జునరావు మాట్లాడారు. 700 రోజులుగా పాలస్తీనాపై ఇజ్రాయిల్ దారుణ మారణకాండ సాగిస్తుందన్నారు. ఇప్పటివరకు సుమారు 52,000 మంది మరణించారని, వారిలో పిల్లలు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనాలో జాతి హననం జరుగుతుందన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదం తన ఆయుధ వ్యాపార ప్రయోజనాల కోసం యుద్ధాన్ని రగిలిస్తోందన్నారు. గత చాలా కాలంగా భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలబడిందన్నారు. అయితే మోడీ అధికారం చేపట్టిన తర్వాత ఇజ్రాయిల్‌లో పర్యటించిన తొలి భారత ప్రధానిగా నిలవడమే కాకుండా అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మన దేశాన్ని మార్చేస్తున్నారని విమర్శించారు. భారత సార్వభౌమత్వం కాపాడాలని ప్రపంచ శాంతి కోసం భారతదేశ నిలబడాలని, వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. తాజాగా ఇజ్రాయిల్ ఇరాన్ మీద దాడి చేయడం, ఇరాన్ ప్రతిదాడి చేయడం పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం రగిలిస్తోందన్నారు. యుద్ధం ఏ రూపంలో జరిగిన ప్రపంచ మానవాళికి అత్యంత నష్టదాయకమని తెలిపారు. ఇప్పటికే ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, యుద్ధం వల్ల ఆయిల్ ధరలు విపరీతంగా పెరిగి, పరోక్షంగా ఆయా దేశాల ప్రజలపై భారాలు పెరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా శాంతి కోసం, పాలస్తీనాకు అండగా నిలబడాలని వామపక్షాలు కోరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రాజకుమార్, రాంమోహన్, వీరబాబు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు కె. అప్పలరాజు, విజయ్ బాబు, సిపిఎం నాయకులు మోర్త రాజశేఖర్, సిహెచ్.రాజ్‌కుమార్, కె.వీరబాబు, సిహెచ్. రమణి, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కె.సింహాచలం, టి.రాజా, సిహెచ్. అజయ్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, మలక వెంకటరమణ, పలివెల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని చేదువాడ గ్రామంలో పాలస్తీనాకు సంఘీభావం వ్యక్తం చేస్తూ ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండ నిర్వహిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, మండల కన్వీనర్ వల్లు రాజబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కడల రాంపండు, షాజహాన్. కుడుపూడి భూచక్రం. దంగేటి శ్రీను, పెంకే శ్రీను, గంజా అప్పారావు, గుత్తుల సూర్యనారాయణ పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణంలోని మెయిన్ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు, మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, కేదారి నాగు, దారపురెడ్డి సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, గరగపాటి పెంటయ్య, కూనిరెడ్డి అప్పన్న, రొంగల సుబ్బలక్ష్మి, మహాపాతిన రాంబాబు, సిరపరపు మరిడియ్య, కూనిరెడ్డి నరసింహమూర్తి, కుంచే అచ్చారావు, అమృత, నమ్రత, చల్లా విశ్వనాథం పాల్గొన్నారు.



కాకినాడలో వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావ ప్రదర్శన



కాజులూరులో పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం



పెద్దాపురంలో సంఘీభావ ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

42వ రోజుకు కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 42వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న శిబిరంలో ఇంజనీరింగ్ కార్మి కులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 42 రోజులుగా తమ సమస్య లు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయ మన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయ కులు బాసిన భద్రరావు, కె.వెంకటరమణ, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, సుంకర సత్తిరాజు, డి.రాజు, పి.శ్రీను, ఎం.భద్రరావు, జి.సతీష్, జి.నాగేశ్వరరావు, మహాపాతిన పాపారావు, అరుణ్, అయ్యప్పస్వామి, శ్రీను, సాయి, ఎస్‌కె.బషీర్, ఒ.సోనియా పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

ఆటో కార్మికుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఆటో కార్మికులకు ఉన్న హక్కులపై సిఐటియు నాయకులు మంగళవారం అవగాహన కల్పించారు. ఉప్పాడలో ఉన్న కనకదుర్గ ఆటో ఓనర్స్, డ్రైవర్స్ సంక్షేమ సంఘ కార్మికుల సమస్యలను మండల సిఐటియు కార్య దర్శి, అధ్యక్షులు కెవిపి.సత్య నారాయణ, కె.నాగేశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. చట్టపరంగా ఆటో కార్మికులకు ఉన్న హక్కులను వివరించారు ఆటో కార్మికుల సమస్యలు ఎదుర్కొనేందుకు జులై 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరంశెట్టి సత్తిబాబు, పట్టా ఆంధ్రయ్య, ఆటో కార్మికుల పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నేతలు

శిక్షణా శిబిరంలో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తుని

6వ ఆంధ్రా ఎన్‌సిసి నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 17 వరకు గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో జరిగిన ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరంలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటుకున్నారు. శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఎల్.సాయిభువనేష్, డి.కృష్ణసాయితేజ, బి. నరసింహ, కె.కవివర్ధన్, ఎ.చంద్రశేఖర్, టి.రామ్‌మణికంఠ వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటి విన్నర్‌గా నిలిచి బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉత్తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వహకులు

19న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి ఎంపిపి కారే సుధా అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పకుండా సకాలంలో హాజరు కావాలని కోరారు. ప్రతీ అధికారి తమ తమ శాఖకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆయన ఆదేశించారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముమ్మరంగా డ్రైయిన్లలో పూడికతీత పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో వర్షపు నీటి ప్రవాహ డ్రెయిన్ల పూడికతీత పనులు ముమ్మురంగా కొనసాగుతున్నాయి. డ్రెయిన్లలో పూడిక పెరిగిపోయి నీటి ప్రవాహం జరగడం లేదని కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆదేశాలతో స్థానిక వరహాలయ్య పేటలో చల్లా వారి గరువు నుంచి కాశీరాజు చెరువు వరకు డ్రెయిన్‌లో పూడిక తీత పనులు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మంగళవారం చేపట్టారు.

కార్టూ'నిజం'



అభివృద్ధిని అడ్డుకుంటారా..?

ప్రజాశక్తి - సామర్లకోట

అధికారంలో ఉన్నన్నాళ్లు ఒక్క అభివృద్ధి పనిని చేయకుండా కూటమి ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడానికి వైసిపి నాయకులకు, కౌన్సిలర్లకు సిగ్గుందా? ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రశ్నించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిఆర్‌పిలకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.4 కోట్లతో మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసినా ఆ పనులను చేయకుండా వైసిపి కౌన్సిలర్లు, వైసిపి నాయకులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. పదవులపై ఉన్న తాపత్రయం వారికి అభివృద్ధిపై లేదని, అందుకే గత ఎన్నికల్లో ఓడిపోయి ఇంట్లో కూర్చున్నారన్నారు. ఇకనైనా విమర్శలు చేయడం, అభివృద్ధిని అడ్డుకోవడం మానుకుని హుందాగా ప్రజా సమస్యలపై మాట్లాడితే వాటిని పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఆర్‌పిలు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని, గత వైసిపి నాయకులతో కలిసి రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మెప్మా సిఎంఎం సయ్యద్ హుస్సేన్, కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిఆర్‌పిల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

22న 'యాసలపు' 13వ వర్ధంతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మాజీ కౌన్సిలర్, సిపిఎం నాయకులు, సాహిత్యకారుడు యాసలపు సూర్యారావు 13వ వర్ధంతిని ఈ నెల 22న నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు తెలిపారు. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ తేదీన సాహిత్య సభ, కవి సమ్మేళనం, కవితా సంకలనం ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, 20వ తేదీన నిర్వహించే రక్తదానం శిబిరంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు పాల్గొంటారని తెలిపారు. 21న కళాకారులకు శిక్షణా శిబిరం జరుగుతుందన్నారు. 22వ తేదీ సాయంత్రం వరహాలయ్య పేటలో జరిగే వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ డి.క్రాంతికుమార్, సిరపరపు శ్రీనివాస్, డి.సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, దారపురెడ్డి కృష్ణ, రొంగల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అర్జీల శాశ్వత పరిష్కారానికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై శాఖల వారీగా శాఖల వారీగా మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 31, 641 దరఖాస్తులు రాగా అందులో 28,993 దరఖాస్తులు పరిష్కరించడం జరిగిందని, ఇంకా 1648 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. వీటిని సత్వరమే దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించడంలో రెండు రకాల లోపాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. అందులో ఒకటి ప్రొసీజర్ లోపం, రెండు బిహేవియర్ లోపంగా ఉందన్నారు. వచ్చే రెండు రోజులలో జిల్లా అధికారులు తమ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించి సిబ్బందికి పిజిఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కారంలో తీసుకోవలసిన పద్ధతులపై వివరించాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో పరిష్కారమైన పిజిఆర్ఎస్ దరఖాస్తులను జిల్లా స్థాయిలో ఫ్రీ ఆడిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎక్కువ మొత్తంలో లోపాలు గుర్తించిన శాఖలు జాగ్రత్త వహించాలని, వీటిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. రీ ఓపెన్ అయ్యే దరఖాస్తుల పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్ఒ జె.వెంకట్రావు, పిజిఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి, డిఎల్‌డిఒ వాసుదేవరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ

మొక్కల నాటడం, వాటిని సంరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఐడిఎ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఎడారీకరణ, కరువు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడారీకరణ, కరువును ఎదుర్కొనేందుకు ప్రపంచ దినోత్సవాన్ని ప్రతి ఏడాది జూన్ 17న నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలకు ఆధారం ఆరోగ్యకరమైన భూమి అభివృద్ధి చెందడం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ ఎన్.మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న డాక్టర్ అడ్డాల

నేరాలు ఘోరాలు

3 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి గ్రామ శివారు నిడదవోలు - నరసాపురం రోడ్డు నయారా పెట్రోల్ బంక్ సమీపంలోని శ్మశానం వద్ద 3 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశారు. పాలుమూరి సాగర్, కర్నినపు ప్రవీణ్ కుమార్, మహ్మద్ సలీ, తగరపు వెంకట్, వర్ధనపు మణిలను అరెస్టు చేశామని సిఐ పి.విశ్వం, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. గంజాయితో పాటూ రెండు బైకులను సీజ్ చేశామన్నారు. రిమాండ్ నిమిత్తం నిందితులను తణుకు కోర్టుకు తరలించామన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - కొవ్వూరు

గోదావరి నదిలో కొవ్వూరు గామన్ బ్రిడ్జి 46వ పిల్లర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని వెలికి తీశారు. మృతుని వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం బాగా పాడైన స్థితిలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ మాత్రికి తరలించినట్లు పట్టాన సిఐ పి.విశ్వం తెలిపారు.

వృద్ధుని అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభద్రానగర్ ప్రాంతానికి చెందిన బొండపల్లి దివాకర్ (65) మంగళవారం అదృశ్యమయ్యారు. మంగళవారం సాయంత్రం వరకు యానాం పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. ఈమేరకు ఆయన కుమారులు బొండపల్లి సతీష్, నరేష్ తన తండ్రి అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




ట్రాక్టర్‌లోకి మట్టిని వేస్తున్న జెసిబి

వైఆర్‌సి భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేరు రిజర్వాయర్‌కు సమీపంలో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రిజర్వాయర్‌కు సమీపంలో గల సర్వేనబర్ 54 నల్ల కంకర క్వారీలు నిర్వహింపబడేవి. క్వారీలో నిర్వహింపబడే భారీ బ్లాస్టింగ్‌ల వల్ల ప్రాజెక్ట్‌కు ముప్పు వాటిల్లుతుందని పూణే కమిటీ శాస్త్రవేత్తలు కమిటీ ఇచ్చిన సిఫారసులతో క్వారీలు నిలిచిపోయాయి. ఆ ప్రాంతంలో తవ్వబడిన క్వారీల స్థానే 50 మీటర్ల ఎత్తున మట్టి నింపాలని నిపుణుల కమిటీ సూచించింది. అధికారులు గోతులు పడిన క్వారీలలో మట్టి పోసి ఆ ప్రాంతాన్ని నో మేన్ జోన్‌గా ప్రకటించారు. అప్పటినుంచి 54 సర్వే నెంబర్ క్వారీల్లో మూతపడంతోపాటు, ఆ ప్రాంతం ఏలేరు ప్రాజెక్టు అధికారుల అధీనంలోకి వచ్చింది. ఇటీవల ఏలేరు రిజర్వాయర్ నిర్వహణకు సిబ్బంది లేకపోవడంతో కొంతమంది అక్రమార్జనపరుల కన్ను ప్రాజెక్టు సేఫ్టీ కోసం ఉంచిన మట్టి నిల్వలపై పడింది. దీంతో నాయకుల అడ్డదండలతో రేయింబవళ్లు అక్రమంగా యంత్రాల సహాయంతో మట్టి తరలించుకుపోతున్నారు. ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయపెత్తనం మితిమీరడంతో అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు మట్టి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని పలువురు కోరుతున్నారు.


ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఇఒ చౌదరి

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని వికలాంగుల బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ విఆర్‌కె.చౌదరి సూచించారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ వల్ల వికలాంగ బాలలకు సత్ఫలితాలు వస్తున్నాయని అన్నారు. కావున వికలాంగ బాలల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఫిజియోథెరపీ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ పాఠశాల హెచ్ఎం పద్మశ్రీ, ఫిజియోథెరపీ డాక్టర్ బి.అపర్ణ, భవిత సిబ్బంది బి.ప్రసాదరావు, బి.ఆనందరావు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని తాళ్లపాలెం, శెట్టిపేట, అట్లపాడు పట్టణంలోని ఎవినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు. సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.లక్ష్మి మాట్లాడారు. పిల్లల్లో సామాజిక, మానసిక అభివృద్ధి సక్రమంగా అభివృద్ధి చెందాలంటే అది అంగన్‌వాడీ కేంద్రాల్లోనే సాధ్యమన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పి.పద్మ, రత్నకుమారి పాల్గొన్నారు.

టైల్స్ అమరికలో చాకచక్యం అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

నీరు లీకేజ్ అవ్వకుండా టైల్స్‌కి టైల్స్‌కి మధ్య సక్రమంగా అమరిక ఉండేలా మేస్త్రీలు చాకచక్యంగా పని చేయాలని ఎజిఎల్ పవర్ గ్రేస్ కంపెని ప్రతినిధి సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎడిబి రోడ్డులోని సాయి ఏజెన్సీ టైల్స్ షాప్‌లో టైల్స్ మేస్త్రీలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైల్‌కి టైల్‌కి మధ్యలో నీరు చేరకుండా, గ్యాప్ రాకుండా ఉపయోగించే మక్కులు సక్రమంగా ఉపయోగించాలన్నారు. టైల్స్ అమరికలో చేపట్టాల్సిన మెలకువలపై మేస్త్రీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది టైల్స్ మేస్త్రీలకు బహుమతులు అందజేశారు. టైల్ షాప్ నిర్వాహకులు వెలుగుల సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో పలు టైల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న కంపెనీ ప్రతినిధి

పూడిక తీత పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెద్దాపురప్పాడు, యండమూరు, విజయరాయుడుపాలెంలో 8 వేల ఎకరాల్లోని ముంపు నీరు దింపుకునేందుకు వెంకటేశ్వర మురుకు డ్రెయినేజీ పూడిక ఈత పనులను ఎంఎల్ఎ పంతం నానాజీ మంగళవారం ప్రారంభించారు. అనంతరం కొవ్వూరు కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరు కొరత రాకుండా పంట కాలువలు ముంపునకు గురికాకుండా మురుకు డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం నాయకులు జోకా అప్పలరాజు, బిరుద శ్రీనివాసరావు, నాయకులు పి.అన్నవరం, ఎ.రాంబాబు, వై.సత్యనారాయణ, పి.ప్రసాద్, బి.చంటిబాబు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నానాజీ

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. మంగళవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ క్యాంటీన్‌ను ప్రారంభించి పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బుదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నాయకులు మాధవు వీరబాబు, కురుమళ్ల నాగేశ్వరావు, మొగిలి గంగాధర్, గంధం శ్రీను, శ్రీమన్నారాయణ, ముత్యాల సుబ్బారాయుడు పాల్గొన్నారు.

నిధులను విడుదల చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2024- 25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామపంచాయతీలకు వెంటనే బదిలీ చేయాలని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ఐదు నెలల క్రిందట రెండో విడత ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.1121 కోట్లను రాష్ట్రానికి విడుదల చేసిందన్నారు. వాటిని స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకుండా జాప్యం చేస్తుందన్నారు. ఫలితంగా పంచాయతీల్లో నిధులు లేక పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా నిలిచిపోయాయని, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నారని అన్నారు. పంచాయితీలకు నిధులు విడుదలలో తీవ్ర జాప్యం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటిపడిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే పంచాయతీలకు నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపినాయకులు

'చంద్రబాబు అంటే మోసం' బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు రావుల గణేష్ రాజా ఆధ్వర్యంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని వైసిపి నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఈ ఏడాదిలో పేదవారికి ఒరిగింది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వరుపుల సూరిబాబు, కురుటూరి వీర్రాజు, కాపవరపు ప్రసాద్, గుర్రం మహాలక్ష్మి, గిడియాల పెద్దకాపు, నకిరెడ్డి ఆదివిష్ణుచక్రవర్తి, గేడ్డం సురేంద్ర, పాలిపిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు గుర్తించి వాటిని జూలై 8వ తేదీలోగా పరిష్కరించాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి సమస్యలు గుర్తించాలన్నారు. ప్రతి పాఠశాలలో గుర్తించిన మంచినీరు, విద్యుత్తు, టాయిలెట్స్, పారిశుధ్య సమస్యలు జూలై 8వ తేదీలోగా పూర్తిగా పరిష్కరించాలన్నారు. జూలై నెలలో విద్యార్థులతో మొక్కలు నాటించాలన్నారు.

తల్లికి వందనంకు విద్యుత్ బిల్లుల షాక్

ప్రజాశక్తి - సామర్లకోట

తల్లికి వందనం పథకానికి విద్యుత్ బిల్లుల షాక్ తగిలింది. పేద ప్రజలకు, ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గానికి అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకంలో ఎవరికైతే 300 యూనిట్లు పైబడి విద్యుత్ బిల్లులు వస్తున్నాయో వారికి అమ్మబడి పథకంలో ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. అలాంటి వారందరూ వారి వారి సచివాలయాలలో సంప్రదించగా మీ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటి నందున తల్లికి వందనం పథకం కింద సొమ్ము జమ కాలేదని సమాధానం వస్తుంది. విద్యుత్ బిల్లులు సరిచేసుకుని వస్తే తిరిగి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని సచివాలయ సిబ్బంది వివరణ ఇస్తున్నారు. దీంతో విద్యుత్తు రెవెన్యూ కార్యాలయం వద్ద గత రెండు రోజులుగా ప్రజల రద్దీ పెరుగుతుంది. దీనిపై విద్యుత్ శాఖ ఎఇ రమేష్‌కుమార్‌ను వివరణ కోరగా విద్యుత్ సబ్సిడీ పొందుతున్న కుటుంబాలకు సైతం వేసవికాలంలో విద్యుత్ వినియోగం కొంతమేర అధికమయ్యే అవకాశం ఉందన్నారు. అలాంటి వారి విద్యుత్తు వినియోగ విషయంలో సంవత్సర కాలానికి గాను సరాసరి లెక్క కట్టి వారి వినియోగానికి సంబంధించి తమ కార్యాలయం నుంచి ఒక లెటర్ అందిస్తున్నామన్నారు. దీనివలన తల్లికి వందనం వంటి పథకాలకు లబ్ధిదారులు అనర్హులు కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.


విద్యుత్ కార్యాలయం వద్ద బారులు తీరిన ప్రజలు

అర్హులందరికీ తల్లికి వందనం నగదు జమ

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల హామీలో భాగంగా అర్హులైన 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకంలో నగదును జమ చేసినట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే అమ్మఒడి పథకం ద్వారా నగదును ఇస్తే...కూటమి ప్రభుత్వంలో 67.27 లక్షల మందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటే అప్పటి సిఎం జగన్‌కు ఏమాత్రం తెలియదని వారికి విధ్వంసం, అక్రమం, అన్యాయాలు చేయడం మాత్రమే తెలుసన్నారు. చంద్రబాబు ఏడాదిలోగా రోడ్లు నిర్మించి సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యం పోసారన్నారు. వరుసగా ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఆర్‌టిసి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలను ఒక్కొక్కటిగా ప్రారంభిస్తామని నవీన్ చెప్పారు. దేశంలోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేందుకు సిఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటికీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంటే చూసి ఓర్వలేక తల్లికి వందనంపై వైసిపి లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నదని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు, ఉంగరాల బూరిబాబు, ఎండి.జహీరుద్దీన్ జిలానీ, పెంకే శ్రీనివాస్ బాబా, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ఎడిబి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సాగరమాల వంతెన వద్ద నుంచి భీమేశ్వర స్వామి ఆలయం వెనుక ఉన్న పొలాలకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబుకు వినతిపత్రం అందచేశారు. మంగళవారం భీమేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం, రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీశ్‌మోహన్, తదితరులు వారిని కలిసి మాట్లాడారు. సర్వీస్ రోడ్డు వేసేందుకు కిలో మీటర్ మేర రైతులు భూములు ఇచ్చేందుకు సైతం అంగీకరించారని తెలిపారు. సర్వీస్ రోడ్డు వేయడం వల్ల దూరప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చే భక్తులకు, రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, సొసైటీ మాజీ అధ్యక్షుడు పైన్నీ శ్రీనివాస్, పట్టణ టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, గోల్తి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గొల్లపల్లి

రూ.54 లక్షల ఎంపీ నిధుల మంజూరు

ప్రజాశక్తి - యానాం

స్థానిక బ్రహ్మానందనగర్‌లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎంపి నిధులు సుమారు రూ.54 లక్షల మంజూరు చేసినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మంగళవారం బ్రహ్మానంద నగర్ వాసులు ఆయన కలిసి కాలనీలో సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో అభివృద్ధి పనులకు బుధవారం భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.


తాగునీటిన పట్టుకుంటున్న కాలనీవాసులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు సావిత్రి నగర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలకు బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్దాని దినేష్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్లతో గ్రామ ప్రజలకు తాగునీటిని అందించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ తాగునీటి సమస్యతో బాధపడుతున్న కనీసం పట్టించుకునే నాధుడే లేడన్నారు. అధికారులు గాని, స్థానిక ప్రజా ప్రతినిధులు గాని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. సమస్యపై వెంటనే స్పందించిన అర్దాని దినేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - పిఠాపురం రోడ్లో ఉన్న టిడ్కో కాలనీలో సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యకు కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను టిడిపి పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు సమక్షంలో కాలనీ మహిళలు కలిశారు. కాలనీలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్లాటులకు ఉన్న రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు తమపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. కాలనీ పరిసర ప్రాంతంలో తుప్పలు, పెరిగి పాములు, ఇతర విషపురుగులు ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. దీనిపై కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బ్యాంకర్ల సమస్య తమ పరిధిలో లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె అన్నారు.